
ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబరు 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







రోడ్డుపై, కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థుల నిరసన


- రోడ్డుపై బైఠాయింపుతో స్తంభించిన ట్రాఫిక్
- పరీక్షలకు అనుమతించని ఎస్‌జిఎస్ ప్రిన్సిపాల్
- కృష్ణా వర్సిటీ ఆదేశాలనే అమలు చేశామంటున్న అధికారులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని శ్రీమతి గేంటెల శకుంతలమ్మ కళాశాలలో నందిగామకు చెందిన 90 మంది ఎంఆర్అర్ కళాశాల విద్యార్థులను సోమవారం పరీక్ష రానీయలేదు. దీంతో ఆ కళాశాల విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. కేరళ, తమిళనాడు, తెలంగాణలోని హైదరాబాద్, నిర్మల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 90 మంది విద్యార్థులు నందిగామలోని ఎంఆర్ఆర్ బిఇడి కళాశాలలో చదువుతున్నారు. వీరంతా 4వ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు జగ్గయ్యపేటలోని ఎస్‌జిఎస్ కళాశాలకు వచ్చారు. అయితే పరీక్ష రాసేందుకు వీరిని అనుమతించొద్దని తమకు మెయిల్ ద్వారా కష్ణా యూనివర్సిటీ నుండి ఆదేశాలు వచ్చినట్లు ఎస్‌జిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల గేటుకు నోటీసు అంటించారు. అంతేగాక ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థులను లోనికి రానీయకుండా గేట్లు మూసివేశారు. దీంతో

(మిగతా 6లో)

జలజీవన్ పనుల్లో జాప్యం

- నత్తనడకన మొదటి దశ పనులు
- రెండో దశ పనులకు రూ. 543 కోట్లు తో అంచనాలు
- 7నియోజకవర్గాల్లో 1017 వర్కులకు త్వరలో టెండర్లు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

జలజీవన్ మిషన్ (జెజెఎం) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మెరుగు పరుస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. భారీ ప్రణాళికలు వేస్తున్నా ఆచరణలో మొదటి దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాజాగా రెండో దశ పనులకు టెండర్లు ఆహ్వానించేందుకు గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం సన్నాహాలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

రెండో దశలో రూ. 543.67 కోట్లతో అంచనాలు

రెండో దశలో జిల్లాలోని అవనిగడ్డ, గుడివాడ, మచిలీపట్నం, పెడన, పామర్రు, గన్నవరం, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడంతోపాటు ప్రతి వ్యక్తికీ రోజుకు 55 లీటర్లు నీటి సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా నీటి వనరులను అభివృద్ధి చేయడానికి పైప్‌లైన్లు, కుళాయిల ఏర్పాటుకు సంబంధించి 1017 వర్కులకు రూ. 543 కోట్లా 67 లక్షల 70 వేలతో అంచనాలతో ప్రణాళికలు రూపొందించారు. త్వరలోనే టెండర్లు పిలవడానికి సన్నద్ధమవుతున్నారు. 2019లో మొదలైన మొదటి దశ పనులు నామమాత్రంగానే జరగడంతో రెండో దశలో భారీ ప్రణాళికతో రూపొందించిన ప్రణాళికులు ఎప్పుటికి పూర్తవుతాయనే చర్చ సాగుతోంది.

మొదటి దశలో జాప్యం

మొదటి దశలో అవనిగడ్డ, గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో 159 కోట్లా 7 లక్షల వెయ్యి రూపాయల విలువైన 618 వర్కులకు టెండర్లు పిలిచారు. మచిలీపట్నం, గన్నవరం నియోజకవర్గాల్లో వర్కులు చేయడానికి కాంట్రాక్టర్లెవరూ టెండర్లు దాఖలు చేయలేదు. కేవలం రూ.9 కోట్లా 56 లక్షల 77 వేల విలువగలిగిన 131 పనులు మాత్రమే పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం జాప్యం చేస్తోందనే ఆందోళనతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడానికి ఆసక్తి చూపడం లేదు. మచిలీపట్నం, గన్నవరం నియోజకవర్గాల్లో పనులకు టెండర్లు దాఖలు కాలేదు. ఈరెండు నియోజకవర్గాల్లో స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించడానికి రూరల్ వాటర్ సప్లయ్ విభాగం కసరత్తు చేస్తోంది.

కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సిన గృహాలు 1, 67, 224

జిల్లాలో మొత్తం గృహాల సంఖ్య 3,84,128 ఉన్నాయి. వీటికిగాను ఈఏడాది ఏప్రిల్ వరకు ఉన్న కనెక్షన్లు 1,85,339, ఏప్రిల్ నుంచి నూతనంగా ఇచ్చిన కనెక్షన్లు 31,665తో కలిపి 2,17,004 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 1,67,224 గృహాలకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.



సంబరాల్లో నృత్యం చేస్తున్న మంత్రి రోజా

సాంస్కృతిక సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రెండురోజుల పాటు జరిగే జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం ఎల్.సుశ్మిత బందం వారు కుచిపూడి నత్యంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంతరం కాళికా మాత నత్యప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో తేళ్లు, నాగపాముతో కళాకారులు చేసిన ప్రదర్శన వీక్షకుల మన్ననలు పొందాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన జోషిక శివునిపై జానపదం గానంతో అలరించింది. డి.ద్వారతి బందంతో లంబాడి నత్యం అందరినీ ఆకట్టుకుంది. సంస్కృతీ సంప్రదాయలను కాపాడేలా బంజారా కళాకారులు వరినాట్లు, కోతలు, ఇంకా ఇతర వ్యవసాయ పనులను నత్యరూపం చేస్తూ అందరి అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. వేదిక కింద నుండి వీక్షిస్తున్న మంత్రి రోజా.. వెంటనే వైదికపైకి వెళ్లి లంబాడి బందంతో నత్యం చేశారు. బందంలోని ప్రతి కళాకారిణికి షేక్ హ్యాండ్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

కళలు బతికే ఉంటాయి

జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో మంత్రి రోజా

ఈసందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ కళలు ఎప్పటికీ బతికే ఉంటాయన్నారు. తెలుగు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు, కళలు, కళాకారుల అభివద్ధిని ఆకాంక్షిస్తూ రాష్ట్వవ్యాప్తంగా ఉన్న కళాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామని

(మిగతా 6లో)

విమానాశ్రయ విస్తరణ బాధిత రైతులకు కౌలు చెల్లించండి

హైకోర్టు ఆదేశం

రెండు వారాల గడువు కోరిన ప్రభుత్వం

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నాలుగేళ్లుగా కౌలు చెల్లించడం లేదని పదిమంది రైతులు వేసిన పిటీషన్‌పై సోమవారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, గన్నవరం తహశీల్దారు నరసింహారావు హైకోర్టుకు హాజరయ్యారు. విమానాశ్రయ విస్తరణలో 200 మందికిపైగా రైతులు తమ భూములను ఇచ్చారని, ఎకరాకు రూ.50 వేల చొప్పున నాలుగేళ్లకు రూ.2 లక్షలు, దానిపై ఐదు శాతం కలిపి చెల్లించాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన కోర్టు జిల్లా కలెక్టర్ హాజరై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. దరిమీలా కలెక్టర్ కోర్టుకు హాజరయ్యారు. ఇప్పటివరకు కౌలు ఎందుకు చెల్లించలేదని కోర్టు ప్రశ్నించగా, రెండు వారాలు అవకాశం ఇవ్వాలని, తదుపరి కౌలు చెల్లిస్తామని ప్రభుత్వం తరుపు న్యాయవాది కోర్టుకు వివరించారు. దీంతో కోర్టు ప్రభుత్వానికి రెండు వారాలు గడువు ఇస్తూ కేసును వాయిదా వేసింది. కౌలు చెల్లించకపోతే మరోసారి కోర్టుకు రావాల్సి ఉంటుందని కలెక్టర్, తహశీల్దార్లను హెచ్చరించింది.

మహిళపై సామూహిక అత్యాచారం?

ప్రజాశక్తి - పెనమలూరు : పెనమలూరు పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఓ మహిళపై సామూహిక అత్యాచారం జరిగినట్లు తెలిసింది. నలుగురు వ్యక్తులు కలిసి ఆమెకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం తెలిసింది. సిగరెట్లతో ఒళ్లంతా క్రూరంగా కాల్చినట్లు తెలిసింది. బాధితురాలు విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్మిక వర్గాన్ని నిర్లక్ష్యం చేస్తే ఇంటికే

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపరాణి

కృష్ణాజిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రవి, మాదల

ప్రజాశక్తి - గన్నవరం : కార్మికులు, ఉద్యోగుల ఆందోళనలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపరాణి విమర్శించారు. గన్నవరం రాయనగర్‌లోని కళ్యాణమండపం (కాజా మస్తాన్, వీర రాఘవయ్య ప్రాంగణం)లో రెండురోజుల పాటు జరిగిన సిఐటియు కృష్ణాజిల్లా 11వ మహాసభ సోమవారం విజయవంతంగా ముగిసింది. స్వరూపరాణి ముగింపోన్యాసం చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పనితీరులో మార్పురాకపోతే చంద్రబాబుకు పట్టిన గతే ఆయనకూ పడుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్, ఆర్‌టిసి చార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. అనంతర మహాసభలో 65 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. 19 మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా చౌటపల్లి రవి, మాదల వెంకటేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.



చౌటపల్లి రవి, మాదల వెంకటేశ్వరరావు

(పూర్తి వివరాలు 5వ పేజీలో)

బిజెపి విధానాలపై సంఘటితంగా పోరాడాలి

బిటిఆర్ జయంతిలో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బిటి రణదివె 119వ జయంతి సందర్భంగా స్థానిక దుర్గాపురం సిఐటియు నగర కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. యూనియన్ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు సమావేశానికి అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు మల్లంపల్లి సాంబశివరావు బిటిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రణదివె స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారని చెప్పారు. కార్మిక సంఘాలు పెట్టి వారిని బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొనేట్లు చేశారన్నారు. ఎమర్జెన్సీకు వ్యతిరేకంగా పోరాటం చేసి కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. 1974లో రైల్వే చారిత్రక సమ్మెకు మద్దతు కూడగట్టటానికి విశేష కృషి చేశారని చెప్పారు.కార్మిక హక్కులు కాలరాసేలా, ప్రజల ఐక్యత దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విధానాలపై పోరాటం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి.సుధాకర్, ఆర్.కోటేశ్వరరావు, ఎం.సీతారాములు, వై.సుబ్బారావు, ఎం.వి.రమణ, బి.గోవింద్, టి.ప్రభుదాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** సిఐటియు అఖిల భారత మాజీ అధ్యక్షులు, కార్మిక ఉద్యమ నేత బిటి రణదివె 119వ జయంతి తిరువూరులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రణదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు తిరువూరు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల, సంక్షేమం కోసం పోరాడిన ఉద్యమాల వేగుచుక్క రణదివె అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.వి భద్రం, మండల నాయకులు ఆకుల రవి, మరకాల ఇశ్రాయేలు, ముఠా యూనియన్ నాయకులు ఆకుల రామారావు, సత్యం, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.


బిటిఆర్‌కు నివాళులర్పిస్తున్న సెంట్రల్ సిటీ నాయకులు

మొక్కలు నాటిన ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని చిల్లకల్లు గ్రామంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రెండో రోజు విద్యార్థులకు ఆటల పోటీలు మూడో రోజు రక్తదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), చిల్లకల్లు గ్రామ నాయకులు శ్రీనివాస్ గౌడ్, దొంగల జానకి రామయ్య, ఉప్పతోళ్ల వెంకటేశ్వరరావు, రూపాన పుల్లయ్య, సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డప్పు కళాకారుడు ఆశీర్వాదం మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు కరిసె ఆశీర్వాదం (55) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆశీర్వాదం భౌతికకాయాన్ని కెవిపిఎస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు, జగ్గయ్యపేట అధ్యక్ష కార్యదర్శులు అదిమళ్ల అబ్రహం, పెద్దపొంగు సిల్వరాజు, స్థానిక డప్పు కళాకారులు ఆనందరావు, ధనమూర్తి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



తిరుపతమ్మ మండల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష మాలాధారణ కార్యక్రమం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ముందుగా ఉదయం 5.56 గంటలకు ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, పలువురు ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు దీక్ష గురుస్వామి వెంకటరమణ ఆధ్వర్యంలో మాలాధారణ చేపట్టారు. అధిక సంఖ్యలో తొలిరోజు మాలాధారణ స్వీకరించడంతో ఆలయ పరిసరాలు ఎరుపు వర్ణంగా మారాయి. ఈ నెల 24వ తేదీ వరకు ఆలయంలో అర్చకులు మాలాధారణ వెయ్యనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ ఉమాపతి, ధర్మకర్తలు రామారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యంగా హక్కులను సాధించుకోవాలి'

ప్రజాశక్తి-తిరువూరు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తిరువూరు విశ్వబ్రాహ్మణ సంఘం 8వ మహాసభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారిలను ఘనంగా సన్మానించారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-వీరులపాడు: నూతనంగా నిర్మించిన నరసింహారావుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వంగవీటి రాధా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, అక్కల గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సాధికారతే లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి-వీరులపాడు: మహిళ సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఎంపిపి కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుటుంబమిషన్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి : సైదులు


అంబారుపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నందిగామ: ప్రభుత్వం ఎటువంటి నిబంధన లేకుండా రైతుల దగ్గర ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో అంబారుపేట, ఐతవరం గ్రామాలలో ధాన్యం రైతులను కలిసి కొనుగోళ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిందని ఆచరణలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆర్‌బికె నిర్ధారించిన తేమ శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ధాన్యం తోలిన ఏడు రోజులలో రైతుల ఖాతాలోకి డబ్బులు జమ చేయాలి, ధాన్యం కాటా రవాణా ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పత్తిపాటి శ్రీనివాసరావు, వెలినేని రమేష్, గోరంట్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




ఇళ్లపట్టాల మంజూరుకు వినతి

ప్రజాశక్తి-తిరువూరు: ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో నివాసముంటున్న తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ కాలనీకి చెందిన నిరుపేదలు సోమవారం 13వ వార్డు సచివాలయంలో, తహశీల్దార్ కా ర్యాలయంలో అధికారులకు వినతిప త్రాలు అందజేశారు. గత 12 ఏళ్లగా పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దార్‌కు విన్నవించుకుంటున్నా ఫలితం లేకుండా పోయిందని, తమ సమస్యను గుర్తించి పరిష్కరించాలని తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈకార్య క్రమంలో సిపిఎం నాయకులు బి.వెం కటేశ్వరరావు,కుల రవి, చప్పిడి సురేష్ బాధితులు పాల్గొన్నారు

కమిషనర్‌పై టిడిపి కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: హెచ్‌బియల్ కంపెనీ కొండపల్లి మున్సిపాలిటీకి ఒక చెత్త పంపిణీ వాహనాన్ని సియస్‌ఆర్ నిధులతో కొనుగోలు చేసి మున్సిపాలిటీ అందజేసే విషయంలో కనీసం ప్రోటోకాల్ పాటించకుండా కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని టిడిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి 29వ వార్డు కౌన్సిలర్ చుట్టుకుదురు శ్రీనివాసరావు తన వార్డులలో కనీసం చెత్త కూడా ఎత్తడం లేదని, మంచినీటి కుళాయిలు ఎన్నిసార్లు చెప్పినా వేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వైసిపి చైర్మన్ అభ్యర్థి గుంజా శ్రీనివాస్ కమిషనర్ పట్ల దురుసుగా ప్రవర్తించకూడదంటూ వారించే క్రమంలో వివాదం మరింత ముదిరింది. వైసిపి నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్ అనుచరులకు టిడిపి కౌన్సిలర్లకు మధ్య మాటామాటా పెరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వైసిపి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు ఖాళీ బాటిళ్లు, కుర్చీలు విసురుకున్నారు. ఇబ్రహీంపట్నం సిఐ శ్రీను, ఎస్సైలు శ్రీను, పాపారావు, భవానీపురం సిఐ ఉమర్ ఇరు గ్రూపులతో మాట్లాడి వారిని అక్కడ నుంచి పంపించి వేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



కలెక్టరేట్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కావడం సర్వ సాధారణమని, అయితే తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చునని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులకు, అర్జీదారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు ఉదయం నడక, యోగా, ప్రాణాయామం వంటివి చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వైద్యులు పవన్‌వర్మ, సునీల్‌వర్మ ఆధ్వర్యంలోని వైద్య బృందం 150 మందికి పైగా అధికారులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జెసి ఎస్ నుపూర్ అజయ్, డిఆర్‌వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి: పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాల సమక్షంలో కొమరగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం డబ్బాకుపల్లి గ్రామంలోని సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి కొమరగిరి భరద్వాజ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి శిబిరం ప్రారంభమవుతుందని, పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోటో వెంట తీసుకొని రావాలని పేర్కొన్నారు. పరీక్షల తర్వాత అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రానున్న క్రిస్మస్ సందర్భంగా మొగల్రాజపురంలోని ఫాతిమా దేవాలయం ఆర్‌సిఎం చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఫాదర్ యమ్.ప్రకాష్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఫాదర్ యమ్.ప్రకాష్ మాట్లాడుతూ చిన్నారులు చేసిన నృత్యాలు ఎంతో అలరించాయని చిన్నారులను అభినందించారు. వివిధ వేషధారణలో చిన్నారులు ముచ్చట గొలిపేలా ఉన్నారని కొనియాడారు, సెమీ క్రిస్మస్ కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా పిల్లల్లో ఐకమత్యం, మతసామరస్యం ఏర్పడుతుందన్నారు, ఈ కార్యక్రమంలో సిస్టర్ టేకులమ్మ, ఫ్రాంశిస్, సాంస్కృతిక కార్యక్రమాల ఇంచార్జ్ రాజ్ కుమార్, ఐశ్వర్య, అంజలి, అభినయ తదితరులు పాల్గొన్నారు.





ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యాలయంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మండ వరలక్ష్మి పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్‌జైరామ్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సరికెట్ నరేష్, సైదా, ఎఇ శ్రీనివాసరావు, ఇన్చార్జి శానిటరి ఇన్స్పెక్టర్ గురునాథం పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై

విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థినీ విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు.జాతీయ వినియోగ దారుల వారోత్సవాలు పురస్కరించుకొని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చిలకలపూడి శ్రీ పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెసి అపరాజిత సింగ్ మాట్లాడుతూ వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చేవారిని, అటువంటి ప్రకటనల్లో భాగస్వాములైన వ్యక్తులకు 10 లక్షల వరకు జరిమానా విధించే అధికారం కేంద్ర ప్రాధికార సంస్థకు ఉందన్నారు. అదే విధంగా మోసపూరిత ప్రకటనల్లో పాల్గొన్న ప్రముఖులపై ఇతర వాణిజ్య ప్రకటనల్లో నటించకుండా ఏడాది నుంచి మూడేళ్ల వరకు నిషేధం విధించవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ,వి. పార్వతి, డివైఈవో యు.వి. సుబ్బారావు, హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఆర్. కె. మూర్తి, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యదర్శి మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి అపరాజిత సింగ్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఘంటసాల : మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకిలో నివాసముండే యలమంచిలి నాగభూషణరావు (65) వ్యక్తిగత పనిపై బైక్‌పై అవనిగడ్డ వచ్చి తిరిగి పోరంకి వెళ్తుండగా, గన్నవరం నుంచి రేపల్లె వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు బైక్ ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యలమంచిలి నాగభూషణరావును కారు డ్రైవర్ హుటాహుటిన ఉయ్యూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో వైద్యులు విజయవాడకు రిఫర్ చేయగా, అంబులెన్స్ లో విజయవాడ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మతి చెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పెనమలూరు : ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబానికి దేవినేని ఆర్మీ, లయన్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. కంకిపాడు మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన సువార్తమ్మకు పాలు, కోడి గుడ్లు, బియ్యం, కూరగాయలు, రూ 5 వేల నగదును అందజేశారు. మండల మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ నేత దేవినేని గౌతమ్ చేతుల మీదుగా సరుకులను పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదాల బారిన పడిన అన్నే ధనకోటేశ్వరరావు, పడవల మధుసూదనరావు, ఆరేపల్లి వెంకట నారాయణ, వెలగ సాంభశివరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. దేవినేని బోసు, జోజి, మురళి, నెరుసు శ్రీనివాసరావు, జాస్తి శ్రీనివాసరావు, కోమటి కిరన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో గోడౌన్ ప్రారంభం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సత్య కృష్ణ గోడౌన్ను గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయిచౌదరి, అచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగానాధరాజు తదితరులు పాల్గొన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రేమ, క్షమాపణ, సహనం కలిగి ఉండటమే నిజమైన క్రిస్మస్ అని ఎంపిడివో కె.వి.సుబ్బారావు అన్నారు. మండల మహిళా సమైఖ్య, వివోఏలు, సీసీల ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ బి.రామానాయక్, ఏపీఎం సుబ్బారావు, పాస్టర్ శేఖర్ బాబు, ఉపాధిహామీ పథకం ఏపీవో సురేష్, గృహనిర్మాణ సంస్థ ఏఈ సురేంద్ర, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-పెడన : మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ నాలుగో విడత కార్యక్రమాన్ని సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేస్టేజ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో శివార్జున నైపుణ్యాభివద్ధి కేంద్రం, కొల్లూరి రాధాకష్ణ భవన సముదాయంలో సోమవారం సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు ఉస్మాన్ భాష ప్రారంభించారు. ఉచిత కుట్టు మిషన్ తో పాటుగా ఎంబ్రాయిడరీ ప్రింట్ అండ్ శారీ రీ పెయింటింగ్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ పర్సనాలిటీ డెవలప్మెంట్ వంటి విషయాలలో కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నటుఉల కోఆర్డినేటర్ కాగిత శంకర సాంబశివరావు తెలిపారు.

యుటిఎస్ యాప్‌తో తక్కువ సమయంలో రైల్వే టికెట్లు

ప్రజాశక్తి-గుడివాడ : రైల్వే ప్రయణికుల సౌకర్యర్థం రైల్వేశాఖ రూపొందించిన యూటిఎస్ మొబైల్ యాప్ ద్వారా తక్కువ సమయంలోనే టిక్కెట్లు పొందే సౌకర్యం కల్పించినట్లు రైల్వే ఛీఫ్ కమర్షియల్ ఇన్స్పెకర్ వి.భగవాన్‌నాయకు, బుకింగ్ సూపర్వైజర్ కె.ప్రభు దాసు, టిటిఐ లక్ష్మణరావులు తెలిపారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో యూటిఎస్ యాప్ పనితీరును ప్రయాణికులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ సమయంలో డిజిటల్ లావాదేవిల ద్వారా సాధరణ జనరల్ టిక్కెట్లు కోసం క్యూలైన్సులో వేచియుండా యటిఎస్ విధనం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్మార్ట్ లివింగ్, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యూరులో శ్రీ చైతన్యస్కూల్ విద్యార్థులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. నగరపంచాయతీ చైర్మన్ వల్ల భనేని సత్యనారాయణ ప్రదర్శనను ప్రారంభించగా పాఠశాల ఆవరణ నుంచి ప్రధాన సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధలనపై నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేబూని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎన్ వీరప్రసాద్ అన్నారు. విద్యతోపాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండేలా ప్రతినెలా పాఠశాలలో ఒక్కో విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ పుల్లయ్య వివరించారు. ఈజీఎం మురళీకష్ణ, ఆర్ఎస్ఐ దీరేంద్ర, డీన్ నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'సెయింట్ జాన్స్'లో పేరెంట్స్ డే వేడుకలు



శాంతి పావురాలు ఎగురవేస్తున్న మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే వంశీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సెయింట్ జాన్స్ మాధ్యమిక పాఠశాలలో సోమవారం జరిగిన పేరెంట్స్ డే వేడుకలు అత్యంత ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన ఆమె అనంతరం ఎమ్మెల్యే వంశీతో కలిసి శాంతి పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తయారు చేస్తోందన్నారు. ఈ దిశగా విద్యార్థులను తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి స్థాయిలో జరిగిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పాటు మంత్రి చేతుల మీదుగా బహుమతులు ఇచ్చారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నత్యాలు ఆకట్టుకున్నాయి . ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ అధ్యక్షతన ఏపీఎస్ఎస్ఏసీ వైస్ చైర్మన్ , ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు , పాఠశాల పూర్వ విద్యార్థి , కార్డియాలజిస్ట్ డాక్టర్ వేంపాటి విశ్వకాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : సర్పంచ్

ప్రజాశక్తి-పమిడిముక్కల : ప్రభుత్వం గ్రామాల అభివద్ధికి కట్టుబడి ఉందని, గాంధీజీ కలలు కన్న గ్రామ అభివృద్ధి జరగాలంటే సచివాలయాలతోనే సాధ్యమని గురజాడ గ్రామ సర్పంచ్ జంపన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని గురజాడ గ్రామ సచివాలయ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ బొల్ల సాంబశివరావును సర్పంచ్ వెంకటేశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు ఏర్పాటు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న సచివాల యాన్ని 34 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామని, త్వరలోనే నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. సచివాలయ నిర్మాణానికి పామరు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు.



రక్తదానం శిబిరం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి ని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఈ నెల 21న ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాట్లను నరసిం హారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు చేపట్టిన ఈ రక్తదాన శిబిరాల్లో యువత పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర చేనేత కులాల సమన్వయకర్తగా వేణుగోపాలరావు

ప్రజాశక్తి-పెడన : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర చేనేత కులాల సమన్వయకర్తగా రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పెడన పురపాలక సంఘం మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుని నియమించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పొలిటికల్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం మంగళగిరిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర బీసీ విభాగం సర్వసభ్య సమావేశంలో నియామక పత్రాలను బొడ్డు వేణుగోపాలరావుకు అందజేశారు.

హోమియో వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక శ్రీ చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఉచిత హెూమియో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పరుచూరి శ్రీనివాసరావు, అడ్డాడ ప్రసాద్ బాబులు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మొదటి, మూడవ సోమవారం డాక్టర్ ఎన్.వి.ఏ.దివ్య రాశి..ఎండి మహిళా రోగులను పరీక్షించి మందులు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్యరాశి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి భారతి, హెూమియో వైద్యులు, ట్రస్ట్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నాడు నేడు పనుల పరిశీలన


ప్రజాశక్తి-పమిడిముక్కల : దాతల సహకారంతో సహకారంతో హనుమంతపురం ఉన్నత పాఠశాలలో అభివద్ధి పనులు చేపడుతున్నామని సర్వ శిక్ష అభియాన్ ఏపీసి శేఖర్ అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని హనుమంతపురం ఉన్నత పాఠశాలలో ఆయన నాడు-నేడు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సొంటి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కలపాల రాంబాబు, సచివాలయ ఇంజనీర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌సాగర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ నగర వాసులను అలరించడానికి జీవన్ సాగర్ ట్రేడ్ ఫెయిర్ వారి తాజ్ మహల్ ఎగ్జిబిషన్‌ని సోమవారం 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ చేతులు మీదుగా ప్రారంభించారు. అన్ని వయస్సుల వారిని ఆహ్లాదకరమైన వాతావరణంలో భవానీపురం కృష్ణా నది ఒడ్డున బొబ్బూరి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ లో ముందుగా ఎర్రకోట ప్రాకారం ఎంతో ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దారు. ఎర్రకోట ద్వారం దాటి ముందుకు వస్తే తాజ్ మహల్ కట్టడం అందరినీ ఆకట్టుకొంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో అత్యాధునిక ఎమ్యూజ్‌మెంట్స్ కొలంబస్, జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, ఎంటర్ ప్రైజెస్, రివాల్వింగ్ టవర్ ఏర్పాటు చేశారు. అలాగే చిన్నారుల



కొసం క్యాటర్ పుల్లర్స్, హెలికాప్టర్, గుర్రాలు, రంగుల రాట్నం, వాటర్ బోటింగ్, జంపింగ్ మేరీ గ్రౌండ్, ఎయిర్ బౌన్స్ ర్, మినీ టోరా టోరా, తదితరాలు ఆకర్షణగా నిలిచాయి. వీటితోపాటు హస్త కళలు, చేనేత వస్త్రాలు,



సిమ్లా బజ్జి, స్పెషల్ ఫుడ్ కోర్టు, వినియోగదారుల అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పోతుల కృష్ణ, అచ్యుయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా న్యాయవాది బబ్బూరి భూపాల్, వై.యస్.ఆర్.సి.పి. యన్.టి.ఆర్. జిల్లా సీనియర్ నాయకులు కమ్మిలి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిగ్రీన్ విద్యుత్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: వాణిజ్య విద్యుత్ వాహన తయారీదారు అల్లిగ్రీన్ నగరంలోని ఆటోనగర్‌లో పూర్తి సరికొత్త రిటైల్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని



ఆర్టీవో ఆర్.ప్రవీణ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహన వాణిజ్య వాహనాల కేంద్రం నగరంలో ఏర్పాటుచేయడం అభినందనీయమని తెలిపారు. అల్లిగ్రీన్ సీఈవో డాక్టర్ అమితాబ్ శరణ్ మాట్లాడుతూ నూతన రిటైల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ద్వారా జరిగిన విస్తరణతో ఐసీఈ నుండి ఈవీలకు మారే ప్రక్రియను సరళతరం చేస్తూ దేశ వ్యాప్తంగా శక్తివంతమైన నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్లు తెలిపారు. అనంతరం లక్ష్మీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఎర్రబల్లి మాట్లాడుతూ అల్లిగ్రీన్‌తో భాగస్వామ్యం చేసుకోవడం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. ఈభాగస్వామ్యంతో నగరంలో ఈవీ విప్లవం తీసుకురానున్నామని తెలిపారు. అల్లిగ్రీన్‌తో భాగస్వామ్యంతో సస్టెయినబుల్ లివింగ్‌కు ప్రచారం చేయడంతో పాటుగా విద్యుత్ మొబిలిటీకి అతి సులభంగా మారడం సాధ్యమవుతుందన్నారు.

సన్‌స్టోన్ 'గ్లోబల్ ఇమర్షన్'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఉన్నత విద్య స్టార్టప్ సంస్థలలో ఒకటైన సన్‌స్టోన్ సంస్థ గ్లోబల్ ఇమర్షన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు సంస్థ డైరెక్టర్ ఎస్.అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. 35కుపైగా నగరాలలో 50కిపైగా ఇనిస్టిట్యూట్‌లను నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా విదేశాలలోని విద్యార్థులకు తగిన విధంగా సహకారం అందించే విధంగా గ్లోబల్ ఇమర్షన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా విదేశాలలో విద్య, తదితర వివరాలను తెలియచేయనున్నట్లు తెలిపారు. రానున్న కార్యక్రమంలో కూడా మరింత స్థాయిలో విస్తృతమైన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

150 మందికి మధుమేహ పరీక్షలు

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 112వ దినోత్సవం సందర్భంగా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం



ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్స్ డయాబెటిక్ స్పెషలైజ్డ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలను నిర్వహించినట్లు బ్యాంకు రీజనల్ హెడ్ శ్రీజయ్ ఎం. ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా బ్యాంకు స్థాపన దినోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే తాము నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మంది ఉచితంగా షుగర్ టెస్టులు, బిపి టెస్టులు చేయించుకున్నారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందచేశారని తెలిపారు. ఈకార్యక్రమంవలో బ్యాంకు సీనియర్ మేనేజర్ షఫీఉల్లాషేక్, బ్యాంకు ముఖ్య అధికారులు శోభనాకుమారి, రాజన్‌కుమార్ పాల్గొన్నారు.

వెన్నం జ్యోతి సురేఖకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి జాయినింగ్ రిపోర్టును సోమవారం అందజేశారు. జ్యోతి సురేఖను క్రీడాకారుల కోటాలో డిప్యూటీ కలెక్టర్‌గా నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, వెన్నం సురేంద్ర తదితరులు ఉన్నారు.



ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ: ఆశ వర్కర్ల ఖాళీ పోస్టులను ప్రభుత్వమే ప్రత్యక్షంగా నియామకాలు చేపట్టాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. ఈ సందర్భంగా కమలా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోవిడ్ కాలంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ గా, అనేక సేవలు అందించిన ఆశ వర్కర్లు, ఇటీవల కాలంలో యాక్సిడెంట్స్, పని ఒత్తిడితో, ఇతర అనారోగ్య సమస్యల వలన, అనేకమంది మరణించారని, ఆశా ఖాళీ



పోస్టులు భర్తీ సందర్భంగా ఆయా కుటుంబాల్లో అర్హులైన వారికి అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో 99 ఆశా వర్కర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, వాటి నియామకాన్ని విలేజ్ శానిటేషన్ కమిటీలకు అప్పజెప్పడంతో, గ్రామాల్లో రాజకీయ నాయకులు జోక్యం పెరిగిందని అన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో, మానేసిన ఆశ వర్కర్ పనిని కూడా ఉన్న ఆశ వర్కర్‌తో చేయించడం వలన, పని భారంతో ఆశ వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతేకాకుండా గత రెండు సంవత్సరాల నుండి , దసరా మహోత్సవాలు, భవాని దీక్షల సందర్భంగా, ఆశ వర్కర్లు, నైట్ డ్యూటీలు తో సహా మూడు షిఫ్ట్ లు వారిగా, డ్యూటీలు చేస్తున్నారని, వారికి టిఎ, డిఎలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. వారి సొంత ఛార్జీలు పెట్టుకుని డ్యూటీలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె ఆరోపించారు. కావున దసరా మహోత్సవాలు భవాని దీక్షలు సందర్భంగా డ్యూటీలు చేసిన ఆశ వర్కర్ల అందరికీ టిఎ, డిఎలు చెల్లించాలని ఆమెకోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి. శ్రీలక్ష్మి, జిల్లా నాయకురాలు పి.పద్మావతి, దయాన రోజ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారులకు అండగా ఉంటాం : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 37వ డివిజన్‌లోని 286వ సచివాలయం పరిధిలో 147వ రోజు సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా ప్రాంతాలలో పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వపరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూల మార్కెట్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రైల్వే వాళ్లతో మాట్లాడి హోల్ సేల్ కూరగాయల మార్కెట్ వారికి అండగా ఉంటామన్నారు. మార్కెట్ వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, చెట్టు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు ఇన్‌చార్జీల నియామకం చేపడతామన్నారు. ప్రభుత్వం చేపట్టే మంచిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

ఆంధ్ర హాస్పిటల్స్ విస్తరణకు కృషి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని ఆంధ్ర హాస్పటల్స్ అభివృద్ధితో పాటు ఎంతో మందికి వైద్య సేవలను అందించడంలో కృషి చేసిన వ్యక్తి పాతూరి వీరభద్రరావు అని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్ర హాస్పటల్స్ ఛైర్మన్ కీర్తిశేషులు పాతూరి వీరభద్రరావు సంస్మరణ సభ సోమవారం ఉదయం నగరంలోని ఎస్ఎసి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, సినీ, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, పలువురు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత వీరభద్రరావు చిత్రపటానికి ఆయన కుమారులు ప్రముఖ వైద్యులు, ఆంధ్ర హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ పి.వి. రామారావు, కుమార్తె డాక్టర్ పాతూరి పద్మ వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు.



మంచినీటి సమస్యను పరిష్కరించండి : సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలోని ఆయా డివిజన్ల పరిధిలో మంచినీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర కమిషనర్‌కు స్పందనలో సత్యబాబు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విజయవాడ నగరంలోని వివిధ డివిజన్లో మంచినీటి సరఫరా వాటర్ రిజర్వాయర్లు పూర్తిగా నింపి నగర ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో మంచినీటి రిజర్వాయర్లు పూర్తిగా నిండకపోవడం ,అలాగే



కృష్ణా నది నుండి ఫిల్టర్ అవుతున్న వాటర్ కలర్ వచ్చి సక్రమమైన వాటర్ రాకపోవడం వలన రిజర్వాయర్లు పూర్తిగా నింపలేకపోతున్నామని అధికారులు తెలియజేయడం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న మంచినీరు నగర ప్రజలకు అందరికీ సరిపడా అందకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ మంచినీటి సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

'దళితులపై దాడులను అరికట్టాలి'

ప్రజాశక్తి-వన్‌టౌన్: వించిపేటలోని సిఎస్ఐ చర్చి కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ దళిత జాగతిసేన వ్యవస్థాపకులు కాసాని గణేష్‌బాబు అధ్యక్షతన దళితుల సామాజిక చైతన్య సదస్సు సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చుక్కపల్లి అవినాష్ పాల్గొని బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ పేరా-3ను సవరించాలని, వరుసగా జరుగుతున్న దళితులపై దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవ్యాంధ్ర రచయితల సంఘం అధికార ప్రతినిధిగా యేమినేని

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడకు చెందిన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ యేమినేని వెంకటరమణను నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. 2023 నుండి రెండు సంవత్సరాల పాటు వెంకటరమణ ఈ పదవిలో కొనసాగుతారని రాష్ట్ర అధ్యక్షులు బిక్కి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ తెలిపారు. సంఘాన్ని, సంఘ కార్యక్రమాల్ని తిరిగి బలోపేతం చేసేందుకు సంఘం రాష్ట్ర కార్యవర్గం కొత్త నాయకుల నియామకాల్ని చేపడుతున్నట్లు కలిమిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణను రాష్ట్ర నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. సీనియర్ పాత్రికేయులు నిమ్మరాజు చలపతిరావు, ఇస్కా రాజేష్, వల్లూరు ప్రసాద్‌కుమార్, సాహిత్య పరిశోధకురాలు సిహెచ్.సుశీలమ్మ అభినందనలు తెలిపారు.



కార్మిక వర్గాన్ని నిర్లక్ష్యం చేస్తే ఇంటికే

● సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపరాణి



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వరూపరాణి



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఆర్.రఘు


నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-గన్నవరం

కార్మికులు, ఉద్యోగుల ఆందోళనలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపరాణి విమర్శించారు. గన్నవరం రాయనగర్‌లోని కళ్యాణమండపం (కాజా మస్తాన్, వీర రాఘవయ్య ప్రాంగణం)లో రెండురోజుల పాటు జరిగిన సిఐటియు కృష్ణాజిల్లా 11వ మహాసభ సోమవారం విజయవంతంగా ముగిసింది. స్వరూపరాణి ముగింపోన్యాసం చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పనితీరులో మార్పురాకపోతే చంద్రబాబుకు పట్టిన గతే ఆయనకూ పడుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్, ఆర్‌టిసి చార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తోందన్నారు. కార్మిక శాఖను నిర్వీర్యం చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌ల ముసాయిదా నిబంధనలపై కార్మిక సంఘాలతో చర్చించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను చట్టవిరుద్ధంగా దారి మళ్లించిందన్నారు. కార్మికుల వేతనాలను పెంచకుండా వారి కడుపు కొడుతోందన్నారు. దేశానికి పట్టిన చీడ మోడీ అని, దానికి పోరాటమనే సరైన మందు వేయకుంటే మొత్తం వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే ప్రమాదం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు

బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే దేశం పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి సిఐటియు కృష్ణాజిల్లా 11వ మహాసభలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బిజెపి ఇంకా అధికారంలో కొనసాగితే దేశం ఆదానీ, అంబానీ చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక సంపదను పెట్టుబడిదారులకు కట్టబెట్టి పేదల నోట్లో మట్టి కొట్టారని చెప్పారు. రాజకీయాల్లో వస్తున్న మార్పులను కార్మికులు అధ్యయనం చేయాలని, వాటికి అనుగుణంగా మన ఆలోచనలు, తీరును మార్చుకుని పోరాటాల్లోకి రావాలన్నారు. కష్ణాజిల్లాలో 3 లక్షల మంది కార్మికులు ఉన్నారని, అందర్నీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి సంసిద్ధులను చేయాలని సిఐటియు శ్రేణులకు పిలపునిచ్చారు. ప్రతినిధుల సభకు చౌటపల్లి రవి, రమ, వేణుగోపాలకష్ణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

పోరాటం వదులుకోకూడదు

సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఆర్.రఘు

దేశంలో కార్మికులంతా పోరాటం వదులుకోకుండా ముందుకు సాగితేనే సమస్యలు అన్ని పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు ఆర్.రఘు అన్నారు. భారతదేశంలో ఇప్పుడున్న పాలకవర్గాలకు సొంత ప్రయోజనాలు, కార్పొరేట్ ప్రయోజనాలే ముఖ్యమన్నారు. పాలకవర్గాల మెడలు వంచటం ద్వారానే మన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్పొరేట్ల అనుకూల విధానాలపై కార్మికులు సమరశీలమైన ఉద్యమాలు చేయాలన్నారు. అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు.

మనం అడుగుతున్నది గుంతెమ్మ కోర్కెలు కావు


ఎన్జీవో సంఘం నాయకులు సాంబశివరావు



ఉద్యోగులు, కార్మికులు అడుగుతున్నది గొంతెమ్మ కోర్కెలు కావని ఎన్‌జిఒ సంఘ: నాయకులు సాంబశివరావు అన్నారు. పాలకులు వాటిని పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తూ మన సహనాన్ని పరీక్షిస్తున్నారని చెప్పారు. ఉద్యమాల ద్వారానే మన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్మిక వర్గం చేస్తున్న పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు.

మహనీయులకు పురిటి గడ్డ గన్నవరం

ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు



ఎందరో మహనీయులకు గన్నవరం పురిటిగడ్డని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు అన్నారు. ఇలాంటి గడ్డపై సిఐటియు కార్మిక జెండా రెపరెపలు చూస్తుంటే ఎంతో ఆనందం, మంచి రోజులు మనవే అన్న భావన కలుగుతోందని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, మానికొండ సుబ్బారావు, మానికొండ సూర్యావతి, నండూరి ప్రసాదరావు, చింతపల్లి పాపారావు వంటి పోరాట యోధుల పాద స్పర్శ ద్వారా ఈ గడ్డకు పోరాట పటిమ అలవడిందన్నారు. ఉమ్మడి గన్నవరం తాలూకా కేంద్రంలో సుమారు 36 మంది వరకు అమరజీవులయ్యారని గుర్తుచేశారు. మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

మోడీ దత్త పుత్రుడు జగన్

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టివి లక్ష్మణస్వామి



కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు టీవీ లక్ష్మణ స్వామి సందేశమిస్తూ దేశంలో రైతులు, కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. అవి పరిష్కారం కావాలంటే ఉమ్మడిగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో రైతులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపుకార్డుల కోసం కౌలు రైతులు అనేక అగచాట్లు పడాల్సి వస్తోందన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి మురాల రాజేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.జ్యోతి సందేశాలిచ్చారు.

నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా తిరిగి చౌటపల్లి రవి, మాదల వెంకటేశ్వరరావు ఎన్నిక

మహాసభలో 65 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. 19 మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా చౌటపల్లి రవి, మాదల వెంకటేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు. కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

నూతన కమిటీ ఆఫీసు బేరర్లు

చౌటపల్లి రవి, మాదాల వెంకటేశ్వరరావు, వై.నరసింహారావు, పి.ధనశ్రీ, ఎం.పోలి నాయుడు, పి.పవన్, బి.సుబ్రహ్మణ్యం, కె.వి.గోపాల్ రావు, కళ్లం వెంకటేశ్వరరావు, జి.కిషోర్ కుమార్, ఒ.గంగాధర్, ఆర్‌సిపి రెడ్డి, బేతా శ్రీనివాసరావు, యు.త్రిమూర్తిరాజు, ఎ.రమాదేవి, మాజేటి శ్రీనివాసరావు, ఎమ్‌డి.కరీముల్లా, ఆర్.సురేష్, కె.శ్రీనివాసరావు.

కూచిపూడి నృత్యం ప్రదర్శించిన చిద్విలాసిని

మహాసభలో చిన్నారి రామినేని చిద్విలాసిని కూచిపూడి నత్య ప్రదర్శనతో అలరించింది. ఆమెను మహాసభ గౌరవాధ్యక్షులు, ప్రముఖ విద్యావేత్త గన్నె వెంకట్రావు, మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు సత్కరించారు.




మురాల రాజేష్


జ్యోతి


ఖాసీం





కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

● సిఐటియు కృష్ణాజిల్లా 11 మహాసభ తీర్మానం ● 25 తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

నిత్యావసరాల ధరలు, ఇళ్ల అద్దెలు భారీగా పెరిగాయని, ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ సిఐటియు కృష్ణాజిల్లా 11వ మహాసభ తీర్మానించింది. మహాసభలో ప్రవేశపెట్టిన 25 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమలల్లో కనీస వేతనాలు పెంచాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఇసుక క్వారీల్లో మనుషులతోనే పనులు చేయించాలని, రిక్షా కార్మికులకు డ్రస్, సబ్సిడీపై ప్లాట్‌ఫాం రిక్షా ఇవ్వాలని, ట్రాన్స్‌పోర్టు రంగంలో పెంచిన పెనాల్టీలు రద్దు చేయాలని, ట్రాన్స్‌పోర్టు, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోరుతూ తీర్మానించింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిధులను తిరిగి జమ చేయాలని, జిల్లాలోని 2,500 పెండింగ్ క్లయిమ్‌లు పరిష్కరించాలని, ఇంటిపనివారికి గుర్తింపు కార్డులివ్వాలని, హయ్యర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలని, బీమా, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి ఇతర సదుపాయాలు కల్పించాలని, స్కీం వర్కర్లను వర్కర్లుగా గుర్తించాలని, అంగన్‌వాడీలకు ఉద్యోగ విరమణ సదుపాయం రూ.5 లక్షలు ఇచ్చి రిటైరయ్యేనాటికి ఉన్న జీతంలో సగం పింఛన్‌గా ఇవ్వాలని తీర్మానించింది. రెండేళ్లుగా రిటైరవుతున్న అంగన్‌వాడీలకు, హెల్పర్‌లకు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ విరమణ సదుపాయాలు వెంటనే విడుదల చేయాలని, ఆశాలకు ఉద్యోగ విరమణ సౌకర్యాలు కల్పించాలని, రిటైరైన ఆశావర్కర్ల కుటుంబాల్లో అర్హులకు ఆశ వర్కర్ పోస్టులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద, ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దని కోరింది. పెరిగిన ధరలకు, మారుతున్న మెనూకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, కార్మికులకు వేతనం పెంచాలని, యానిమేటర్ల (విఒఎ) మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికుల టెండరు పద్ధతి రద్దు చేసి రెగ్యులర్‌గా కొనసాగించాలని విజ్ఞప్తి చేసింది. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు మ్యాన్‌డేస్‌తో సంబంధం లేకుండా కనీస వేతనాలిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎల్‌ఐసి ఏజెంట్లు, 104, 108, ఆర్‌టిసి, రైల్వే కాంట్రాక్టు కార్మికులు సమస్యల పరిష్కరించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని తీర్మానించింది. వీటన్నింటినీ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

రైతులకు న్యాయం చేయాలని టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : రైతులకు న్యాయం చేయాలంటూ గన్నవరంలో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించి సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేసారు. ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు, సాగునీటి వినియోగదారు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దొంతు చిన్న,గన్నవరం మండలం పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వర రావు, రాష్ట్ర రైతు కార్యదర్శులు గుండపునేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కొండేటి కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా కార్యదర్శి జూపల్లి సురేష్,రాష్ట్ర మహిళ కార్యదర్శి మండవ లక్ష్మి, జిల్లా రైతు కార్యదర్శి ఖమ్మంపాటి సుభాష్ చంద్రబోస్, పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.72.68 లక్షలు

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం సోమవారం మచిలీపట్నం దేవాదాయ, ధర్మదాయ శాఖ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాస్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ ఎన్ సూర్య చక్రధర్‌రావుల పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా 65 రోజులకుగానూ రూ. 70 లక్షల 32 వేల 42 రూపాయలు, అన్నదానం హుండీ ద్వారా రెండు లక్షల 36 వేల 177 రూపాయలు వెరసి మొత్తం 72 లక్షల 68 వేల రెండు వందల ఇరవై రెండు రూపాయలు నగదుగా లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ సూర్య చక్రధరరావు తెలిపారు. హుండీ లెక్కింపు లో 162 అమెరికన్ డాలర్లు, 100 ఆస్ట్రేలియన్ డాలర్లు, మూడు కేజీల 550 గ్రాముల వెండి, 30 గ్రాముల బంగారం లభించినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. ఆలయ సూపరిండెంట్ బి సత్యనారాయణ, ఆలయ అధికారులు టి చెన్నకేశవ, టి రామకష్ణ, పి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నేడు సెమీ క్రిస్మస్ వేడుకలకు సిఎం హాజరు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ఏప్లస్ కన్వెక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన మైనార్టీ కార్పొరేషన్ యండి జె. ఎలీషాతో సెమి క్రిస్మస్ వేడుక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ క్రైస్తవ సోదరీ సోదరిమణులతో కలిసి క్యాడిల్స్ వెలిగిస్తారని, క్రిస్మస్ కేక్‌కట్ చేస్తారని, తేనేటీ విందులో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతారన్నారు.

ముగిసిన భవానీ దీక్షల విరమణ

ప్రజాశక్తి-వన్‌టౌన్ : భవానీ దీక్షల విరమణ సోమవారంతో ముగిసింది. ఈ నెల 15 నుండి 19 వరకు ఐదు రోజుల పాటు దీక్షల విరమణ నిర్వహించినట్లు దుర్గగుడి ఇఒ దర్భముళ్ల భ్రమరాంబ తెలిపారు. భవానీ దీక్షల విరమణ చివరి రోజు సోమవారం దేవస్థానంలోని చండీ హోమ యాగశాలలో ఆలయ వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ భ్రమరాంబ, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు ఎల్. రమాదేవి, సహాయ కార్యనిర్వాహణాధికారి పి.సుధారాణి, వన్‌టౌన్ సిఐ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఒ భ్రమరాంబ మాట్లాడుతూ గత సంవత్సరం సుమారు 4 లక్షల మందికిపైగా యాత్రికులు వచ్చారని, ఈ సంవత్సరం సుమారు 5.40 లక్షల మంది దుర్గమ్మను దర్శించుకున్నారని తెలిపారు. ఐదు రోజుల్లో 15 లక్షలకుపైగా లడ్డూలు యాత్రికులు కొనుగోలు చేశారని, లక్ష మంది యాత్రికులు తలనీలాలు సమర్పించారని వివరించారు. రూ.45 లక్షల విలువైన రూ.100, రూ.300, రూ.500 దర్శనం టికెట్లను కొనుగోలు చేశారన్నారు. దేవస్థానం బస్సులు 8, ఆర్‌టిసి బస్సులు నాలుగు ఉచితంగా నడిపినట్లు తెలిపారు. 23,700 వేల మందికి అన్న ప్రసాదం, 80 వేల మందికి ఉచిత ప్రసాదం పంపిణీ చేసినట్లు చెప్పారు.



ఎక్సెల్ ప్లాంట్‌ను సందర్శించిన దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సింగ్‌నగర్లోని ఎక్సెల్ ప్లాంట్‌ను సందర్శించారు. ఐకానిక్ పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈపర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఇఇ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : గొల్లపూడి కార్యాలయంలో ఏజెళ్ళ పుష్పావతి జ్ఞాపకార్థం వారి కుమార్తెలు ఏ.సీతారావమ్మ, స్వరూప రాణి రూ.50వేల చొప్పున మైలవరం అన్న క్యాంటీన్‌కు విరాళంగా అందజేసారు. వారిని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అభినందించారు.

'స్పందన'లో 17 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 17 అర్జీలు సమర్పించగా, వాటిలో ఇంజనీరింగ్ విభాగం 8, పట్టణ ప్రణాళిక 4, రెవెన్యూ 4, యుసిడి (పిఒ) 1 అర్జీ వచ్చింది. ఈకార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏడిహెచ్ శ్రీనివాసురావు పాల్గొన్నారు. అలాగే సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన స్పందనలో ఆరు అర్జీలు వచ్చాయి.

రూ.14 లక్షలతో సిసి రోడ్డు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : నున్న గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు విజయవాడ రూరల్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి చెప్పారు. సోమవారం గ్రామంలోని యాలాల బజారు వద్ద సిసి రోడ్డు పనులు ఆయన ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.14 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ కె.సరళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె. బ్రహ్మానందరెడ్డి, సొసైటీ చైర్మన్ పి.చంద్రారెడ్డి, ఇఒ జి. వెంకటరమణ, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థుల నిరసన

దిక్కుతోచని విద్యార్థులు ఎస్‌జివిఎస్ కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. తమకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్ష రాయనీకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో విజయవాడ - జగ్గయ్యపేట రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వచ్చి ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈసందర్భంగా ఎంఆర్ఆర్ బిఇడి కళాశాల విద్యార్థులు తాము ఎక్కడి నుంచో వచ్చి చదువుకుంటున్నామని, ఇప్పటివరకు మూడు సెమిస్టర్ పరీక్షలు రాశామని తెలిపారు. ఆయా పరీక్షల ఫలితాలు రాలేదన్నారు. ఇప్పుడు తమకు హాల్ టికెట్లు సైతం ఇచ్చి ఏకంగా పరీక్షలే రాయనీయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తాము కళాశాల యాజమాన్యానికి వేలాది రూపాయలు చెల్లించామని, ఏమైనా సమస్యలుంటే కళాశాల యాజమాన్యం వారు, యూనివర్సిటీ వారు తేల్చుకోవాలని, అంతేకానీ తమను పరీక్ష రాయనీయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జగ్గయ్యపేట ఎస్‌జివిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఎంఆర్ఆర్ కళాశాల విద్యార్థులను నాలుగో సెమిస్టర్ పరీక్షలకు అనుమతించొద్దని తమకు ఆదివారం మెయిల్ వచ్చిందన్నారు. దీంతో తమ కళాశాల గేటుకు నోటీసు అంటించామన్నారు. అదే కళాశాలకు సప్లమెంటరీ విద్యార్థులను, ఎంఇడి విద్యార్థులను పరీక్షలకు అనుమతించామని తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ వారు తమకు అందించిన సూచనల ప్రకారమే ఆ విద్యార్థులను పరీక్షలకు అనుమతించలేదని తెలిపారు. యూనివర్సిటీ ఎగ్జామినర్‌తో తానూ మాట్లాడానని, ఐనా ఆ విద్యార్థులను అనుమతించవద్దని తేల్చిచెప్పారని స్పష్టం చేశారు.

సాంస్కృతిక సంబరాలు ప్రారంభం

చెప్పారు. వేదిక ప్రాంగణంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కుటుంబంపై ఏర్పాటు చేసిన 'ఆర్ట్ ఎగ్జిబిషన్'ను ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం వేదికలుగా నాలుగు జోన్లలో పాత, కొత్త కళాకారుల సమ్మేళనంతో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు నిర్వహించామన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు భవిష్యత్తరాలకు అందించేందుకు ఎటువంటి ఢోకా లేదని, కళలు ఎప్పటికీ బతికే ఉంటాయని అన్నారు. రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రపంచమంతా కుచిపూడి నత్యానికి ప్రాచుర్యం ఉందని, అలాంటి ప్రఖ్యాతిగాంచిన ఈ నత్యం కష్ణా జిల్లాలో పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్, రాష్ట్ర సజనాత్మకత, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష, కృజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్.పి.భారతి, పాల్గొన్నారు. కె.వి సత్యనారాయణ, శారద రామకష్ణ, మోదుమూడి సుధాకర్, ఉమామహేశ్వర పాత్రుడు, కలి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

స్పందన అర్జీలకు స్థానికంగానే పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : స్పందన అర్జీలకు స్థానికంగానే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులకు గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందనలో 102 వినతులు నమోదు కాగా, వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 42 అర్జీలు నమోదయ్యాయి.

ఆర్‌బికెల్లో విశ్లేషించిన తేమ శాతమే ఫైనల్ : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉంటే ఫోన్ చేస్తే గంటలో పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలు ఉంటే 9652014457 ఫోన్ నెంబరుకు ఫోన్ చేసిన గంటలో పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. గోనె సంచుల కొరత జిల్లాలో ఎక్కడా లేదని అన్నారు.ఆర్ బీకేలో విశ్లేషించిన తేమ శాతం ఫైనల్ అని, దీని ప్రకారమే ఎఫ్‌ఓ జనరేట్ చేయడం జరుగుతుందన్నారు. ఆమేరకు రైతుకు చెల్లించడం జరుగుతుందని, రైతులు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రభుత్వ మద్దతు ధరలు పొందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. మాండూస్ తుఫాను సందర్భంగా కురిసిన వర్షాలకు జిల్లాలో నష్టం జరిగిన చోట్ల మండల టీమ్ ఎన్యూమరేషన్ నిర్వహిస్తున్నాయన్నారు. నష్టం అంచనాలపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ ఐ. కిషోర్, డ్వామా పీడీ, జివి. సూర్యనారాయణ, డిఎం అండ్ హెచ్ ఓ డా.గీతాబాయి, డిఆర్డిఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, డిపిఓ నాగేశ్వరనాయక్,డి ఎస్ ఓ, వి.పార్వతి,డి ఈ ఓ, తాహెర సుల్తానా,సాంఘిక సంక్షేమ శాఖ డిడి, కె.సరస్వతి,బి సి సంక్షేమ శాఖ డి డి,సి హే చ్ లక్ష్మి దుర్గ, పి ఆర్ ఎస్ ఈ, ఈరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జెసి

గన్నవరం పంచాయతీలో మళ్లీ రగడ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పంచాయతీ పాలకవర్గ సమావేశం నుండి సభ్యులు వాకౌట్ చేయడంతో సమావేశం నిలిచిపోయిన సంఘటన సోమవారం జరిగింది. సర్పంచ్ నిడమర్తి సౌజన్య అధ్యక్షతన పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులతోపాటు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. అయితే జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండి గౌసాని కూడా సమావేశానికి రావడంతో సభ్యులంతా వ్యతిరేకించారు. గౌసాని సమావేశం లో పాల్గొనేందుకు అర్హత ఉందా అని పంచాయతీ కార్యదర్శి బాపూజీని ప్రశ్నించారు. ఆయన తగిన రీతిలో సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో అసంతప్తిలోనైనా సభ్యులంతా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సమావేశం నిలిచిపోయింది. పంచాయతీ చరిత్రలో ఈ విధంగా ఎప్పుడు జరగలేదని సభ్యులు చెప్పారు. జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పాల్గొనేందుకు అర్హత లేదని అయినా కావాలని గౌసాని రావడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయంగా వివాదాలు రేపడానికి ఈ రకమైన చర్యలకు పూనుకుంటున్నారని కొంతమంది మండిపడ్డారు.

అంబేద్కర్ చిత్రపటాలు పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

బాపులపాడు మండలం పరిధిలో ఉన్న అన్ని గ్రామ సచివాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి మండల కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటాల బహూకరించారు. సిరివాడ, ఆరుగొలను, ఓగిరాల గ్రామ పంచాయతీ లకు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోటా సురేష్ చేతుల మీదుగా అందించారు. డాక్టర్ బి.అర్ అంబేద్కర్ చిత్రపటాలని దాతల సహకారంతో అందజేశామని మండల కన్వీనర్ కాలి కిరణ్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేందర్రావు, నూకల శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులపై విచారించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోవడానికి కారణం డ్రైనేజీ పనులు సక్రమంగా జరగకపోవడమేనని దీనిపై తగిన విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నాయకులు అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించకుండా అరకొర పనులు చేసి బిల్లులు చేసుకున్న ఘటనలో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. జిల్లా కలెక్టర్ సైతం ముంపు బారిన పడిన పంట పొలాల్లో నీటిని తోడించమని ఆదేశించినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండి రాఘవ, ఘంటసాల కన్నయ్య, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

మల్లేశ్వరంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో పెడన నియోజక వర్గ టీడీపీ ఇంఛార్జి కాగిత కష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సాదర బోయిన ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు కూనపు రెడ్డి వీరబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా కాశీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంగుమోలు శివ, నియోజక వర్గ నాయకులు సన్నాల ప్రసాద్, సర్పంచ్ చెన్ను శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అవనిగడ్డ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. సోమవారం అవనిగడ్డ పరిధిలోని మూడవ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటిం టికి తిరిగి సంక్షేమ పథకాల బుక్లెట్స్ అందించి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వ రరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని 'స్పందన'లో వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : మాండూస్ తుపాను ప్రభావానికి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు, స్పందనలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎం టి యు 10 20, 1036 ధాన్యాన్ని ఆర్బికేల ద్వారా కొనుగోలు చేయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌరీశెట్టి నాగేశ్వరావు, ఆర్ఆర్ ప్రసాద్ ఉపాధ్యక్షులు కొల్లి వెంకటేశ్వరావు,కొలు రైతు సంఘం నాయకులు కె.శివ నాగేంద్ర రావు, ఎస్ లక్ష్మణ్ రావు, తదితరులు ఉన్నారు.

శ్మశానాలను అభివద్ధి చేయాలని వినతి

మచిలీపట్నంలో ఉన్న శ్మశానాలను అభివద్ధి చేయాలని కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సోమవారం జె.సి అపరాజితా సింగ్ కు స్పందనలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శేకుబోయిన మాట్లాడుతూ మచిలీపట్నంలో ఉన్న 18 స్మశానాలు ఎటువంటి అభివద్ధికి నోచుకో లేదన్నారు. కొన్ని స్మశానాల్లో పాకలతో పాటు,పందుల పెంపకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ధనికొండ చిన్ని, జన్ను గోవిందు, చేబోయిన కోటేశ్వరరావు, బోయిన రమేష్, పుట్టి రాజశేఖర్, జోగి శివ, ఎం. పవన్ పాల్గొన్నారు.

ఆదాయం అందరికీ పంచాలని వినతి

భూముల మీద వచ్చే ఆదాయం గ్రామస్తులు అందరికీ సమానంగా పంచే విధంగా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్, జిల్లా కమిటీ సభ్యులు అంబటి ప్రసాద్ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ కు స్పందనలో వినతి పత్రం అందజేశారు. తోట్లవల్లూరు మండలం కళాసు మాలపల్లి గ్రామంలో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని ఫీల్డు లేబరు కో-ఆపరేటివ్ సొసైటీ కింద 80 ఎకరాల భూమి, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కి చెందిన నది పరివాహక భూమి 70 ఎకరాలు తదితర చోట్ల భూములు ఉన్నాయని, కొంతకాలంగా గ్రామపెద్దలు వచ్చిన ఆదాయం అందరికీ పంచకుండా అడిగిన వారిని బెదిరించుచు భౌతిక దాడులు చేస్తున్నారన్నారు. శారీరకంగ దాడులు చేస్తున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కెవిపి ఎస్, జిల్లా కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, వ్యకాస జిల్లా కమిటీ నాయకులు శీలం ప్రకాశరావులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘాల నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

బాపులపాడు మండలం వీరవల్లీ సాయి రైస్ ఫ్లోర్ మిల్లు అవరణలో గన్నవరం వీకేఆర్ కళాశాల 1994 - 97 బీకామ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత తామంతా కలుసుకోవట అనందంగా ఉఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాటూరి వీరబాబు , పడమట రంగారావు, కుందేటి శ్రీనివాసరావు, గండి చిన్నారావు ,బండి సాంబిరెడ్డి ,గ్రామానికి చెందిన మోర్ల ఆంజనేయులు అన్నారు.

అన్ని పండుగలకు సెలవులు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-గుడివాడ

సంక్రాంతి, దసరా పండుగలకు ఇచ్చే పాఠశాలల సెలవులు రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా 10రోజులు సెలవులు ఇవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పిలుపు మేరకు క్రిస్టియన్స్, ముస్లింలు కలసి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధకార్ అధ్వర్యంలో స్థానిక ఆర్‌డివో కార్యాలయం వద్ద నిరసన వ్యక్త చేసి ఆర్‌డివో కార్యాలయం ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో పాసర్లు పాల్ విక్టర్, ఎలిజర్, రాజు, మస్లీం నాయకులు షేక్ సర్కార్, సయ్యద్ జబీన్, ఎంఆర్‌పిఎస్ నాయకులు అత్తటి సాల్యన్, పసలాది శేఖర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నాగాయలంక

ఈనెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నాగాయలంక మండలం జిల్లా పరిషత్ హైస్కూల్లో క్రీడా పోటీలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపార. ఈసందర్భంగా విద్యార్థులతో కబడ్డీ ఆట ఆడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులక బహుమతులు అందించారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండూస్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అవనిగడ్డ మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ఏడిఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏడిఏ జయప్రద ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు మినుము, పెసలు లాంటి రవి విత్తనాలు తక్షణమే ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేయాలని, తేమశాతం ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం కింద ఒక ఎకరానికి రూ 25000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మట్టి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తుంగల నరేష్, బొప్పన పథ్వి, ప్రధాన కార్యదర్శి యక్క టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

గారపాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-ఉంగుటూరు :ఉంగుటూరు మండలం గారపాడు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉంగుటూరు మండల పార్టీ ప్రసిడెంట్ డాక్టర్ అరుమాళ్ళ వెంకట కష్ణారెడ్డి, కుమ్మరి వెంకటేశ్వరరావు, సెక్రటరీ కాటూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు చింతయ్య, చిన్నబాబు పాల్గొన్నారు.





హోరాహోరీగా క్రీడా పోటీలు

• వివిధ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ప్రతిభ
• పతకాల పట్టికలో దూసుకుపోతున్న తెలంగాణ



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. తెలుగురాష్ట్రాల క్రీడాకారులు రాణిస్తున్నారు. ముఖ్యంగా మెడల్స్ జాబితాలో తెలంగాణ దూసుకుపోతుంది. ఇప్పటివరకు తెలంగాణ క్రీడాకారులు వివిధ విభాగాల్లో 27 పతకాలు కైవసం చేసుకుంది. వీటిలో 14 స్వర్ణం, నాలుగు రజతం, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 11 పతకాలు దక్కించుకుంది. వీటిలో రెండు స్వర్ణం, 5 రజతం, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. ఓవరాల్ మెడల్స్ జాబితాలో గుజరాత్ 20 పతకాలతో రెండవ స్థానంలో ఉంది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ బాలికలు ఉత్తమ ప్రతిభ కనపరచారు. అండర్ -19 బాలికల ట్రిపుల్ జంప్‌లో 9.90 మీటర్లతో రాష్ట్రానికి చెందిన డి.శ్రీజ మొదటి స్థానంలో నిలిచింది. 9.55 మీటర్లతో తెలంగాణఖు చెందిన బొంత స్నేహ రెండవ స్థానం, 9.30 మీటర్లతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీవల్లి మూడవ స్థానం సాధించింది.

డిస్కస్ త్రో: అండర్ -14 బాలుర విభాగంలో డిస్కస్ త్రో లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. 29.79 మీటర్లతో మిఒదటి స్థానం బోయ మహేంద్ర సాధించగా, 25.99 మీటర్లతో రెండవ స్థానంలో మన రాష్ట్రానికి చెందిన వి.సుశాంత్ రెడ్డి నిలిచాడు. 24.53 మీటర్లతో ఉత్తరాఖండ్‌కు చెందిన రాజేష్ చౌహాన్ మూడవ స్థానం సాధించాడు.



హైజంప్: అండర్-19 బాలుర కేటగిరిలో 1.64 మీటర్లతో ఒడిశాకు చెందిన ఎం.రంజిత్ మొదటి స్థానం, 1.64 మీటర్లతో ఒడిశాకు చెందిన హెచ్. దీపక్ రెండవ స్థానం, 1.61 మీటర్లతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కె.అనిష్ మూడవ స్థానం సాధించారు.

800 మీటర్ల పరుగు: అండర్ -19 బాలుర విభాగంలో చత్తీస్‌ఘడ్‌కు చెందిన అరుణ్ కొవచి 2.05 నిముషాల్లో లక్ష్యంచేరి తొలిస్థానం సాధించగా 2.08 నిముషాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిర రంజిత్ కుమార్ రెండవ స్థానం, 2.12 నిముషాల్లో లక్ష్యంచేరి జార్ఖండ్‌కు చెందిన అలోక్ మూడవ స్థానం సాధించాడు.

ఫుట్‌బాల్ : గ్రూప్-సిలో జార్ఖండ్ - కర్ణాటక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 11-0 గోల్స్ తేడాతో జార్ఖండ్ జట్టు గెలుపొందింది. అండర్ -19విభాగంలో గ్రూప్‌డి మ్యాచ్‌లో ఒడిశా - సిక్కిం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. గ్రూప్-ఇలో తమిళనాడు - త్రిపుర జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. గ్రూప్ -బిలో గుజరాత్ - రాజస్తాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-0 గోల్స్‌తో గుజరాత్ గెలుపొందింది.

ఎఎన్‌యులో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ప్రాంగణంలో రెండో రోజు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్చరీ, కబడ్డీ, అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో క్రీడలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో క్రీడాకారుల వసతుల ఏర్పాట్లను గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కబడ్డీ పోటీలను పరిశీలించారు. కబడ్డి కోర్టులోకి వెళ్లి కాసేపు మ్యాచ్ ను తిలకించారు. ఉత్సాహంగా ఆటల పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. కాంతిలాల్ దండేతో పాటు జాయింట్ సెక్రటరీ హేమలత సహా గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈత పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ క్రీడల్లో భాగంగా సోమవారం ఈత పోటీలను విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతీయ స్థాయిలో 22 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ నెల 22 వరకు జరిగే ఈ పోటీలను సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు జెండా ఊపి ఈత పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయరు రాయన భాగ్యలక్ష్మి , నగర కమిషనరు స్వప్నిల్ దినకర్ పున్కర్ స్థానిక కార్పొరేటర్ బాలి గోవిందు, డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ తోట శ్రీనివాస్ ,ఇతర ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొని క్రీడాకారులందరినీ అభినందించారు.



క్రీడలు విద్యలో భాగం కావాలి

ఘనంగా మోడ్రన్ అకాడమీ క్రీడా దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని చక్కగా రాణించి మంచి క్రీడాకారులుగా తయారవ్వాలని, క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ పరంగా మంచి ప్రోత్సాహం ఉంటుందని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మోడరన్ అకాడమి ఆఫ్ టెక్నికల్ అండ్ జనరల్ ఎడ్యుకేషన్ వారి క్రీడా దినోత్సవ వేడుకలు నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో సోమవారం జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా పాల్గొన్న భాగ్యలక్ష్మి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యా విధానంలో క్రీడలు భాగమవ్వాలన్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి రోజూ ఆటలు ఆడటం ద్వారా జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు విద్యార్థులు చురుకుగా ఉంటారని, ప్రతి అంశాన్ని సమగ్రంగా గ్రహించగలరని అన్నారు. మోడరన్ అకాడమి సంస్థ తమ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలను నిర్వహించడం అందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని ఈసందర్భంగా మోడరన్ అకాడమి యాజమాన్యాన్ని అభినందించారు. మోడరన్ అకాడమి డైరెక్టర్ పి.వినయ్‌రంజన్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలోని విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా వివిధ క్రీడాంశాలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీచ పిఎంఎ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, క్యారమ్స్, చెస్, పరుగు పందెంలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందచేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ సుంకర పూర్ణిమ పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ప్రపంచ తెలుగు రచయితల మహాసభ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, సిద్దార్ధ అకాడమి సంయుక్తంగా ఈ నెల 23, 24 తేదీలలో 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించనున్నారు. మహాసభలు మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ అకాడమిలో రెండు రోజుల పాటు జరుగనున్నాయి. మహాసభలకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా వివిధ తెలుగ సంస్థలకు చెందిన రచయితలు రానున్నారు. సుమారు 15 దేశాల నుండి ప్రతినిధులు రానున్నారని ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచంద్ తెలిపారు. మహాసభల నిర్వహణకు సిద్దార్ధ కళాశాల ప్రాంగణంలో మూడు వేదికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వివిధ అంశాలపై సదస్సులను నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నామని తెలిపారు.

విఆర్ఒలకు పని భారం తగ్గించాలి : సిఐటియు

ప్రజాశక్తి-వీరులపాడు: విఆర్ఒలకు రీసర్వేతో పాటు రెగ్యులర్ రెవెన్యూ సర్వీసులు ఉండటంతో పని భారం పెరిగిందని, వారికి పత్తి ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విఆర్వోలకు, సర్వేర్లకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూముల రీసర్వేకు సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళిక ఉండటం వల్ల వంద రోజుల్లో రీసర్వే పూర్తి చేయాలనే నిబంధనను సడలించాలని కోరారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎంపిపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు దాతృత్వంతో పదో తరగతి చదువుతున్న బాలబాలికలకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. సుమారు రూ.23 వేల రూపాయలతో 355 మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.విశ్వభారతి, దాసరి సతీష్, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు బిబివి దుర్గారావు, ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, యుటిఎఫ్ కార్యకర్తలు మంగమ్మ, శ్రీనివాసరావు, తేజస్విని, రామ్ కుమార్, జాన్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కొన్ని పలు వార్డులో గత వారం రోజుల నుంచి ప్రజలు మంచినీటి సదుపాయం లేక ఇబ్బంది పడ్డారని, 30 సంవత్సరాల తర్వాత హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతంలో మోటార్స్ చెడిపోవడమే ఇందుకు కారణమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేందర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు మోటార్లు మొరాయించడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారని తెలిపారు. 20 రోజుల పనిని తక్కువ సమయంలోనే పూర్తి చేసి ప్రజలకు మంచినీటిని పునరుద్దరించినట్లు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: క్రిస్మస్ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బదరి నారాయణరావు ప్రతి సంవత్సరంలాగానే ఈ ఏడాది పేదలకు దుప్పట్లు, చీరలు సోమవారం పంపిణీ చేశారు. విన్సెన్ట్ డే పాల్ సేవ కమిటీ అధ్వర్యంలో స్థానిక ఆర్‌సియం చర్చిలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరామ్ బదరి నారాయణరావు సోదరుడు శ్రీరామ్ జయ తదితరులు పాల్గొన్నారు.